సీఎంతో సన్మానానికి మర్లపాడు విద్యార్థిని

వడ్డెరపు జయశ్రీ

మధిర, జూన్ 9: సీఎం నుంచి సన్మానం అందుకునే అరుదైన కార్యక్రమానికి మండలంలోని మర్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని వడ్డెరపు జయశ్రీ ఎంపికైంది. ప్రధానోపాధ్యాయుడు భీమరాజు తెలిపిన వివరాలు.. ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ విద్యార్థులను హైదరాబాద్‌లో సన్మానించే కార్యక్రమాన్ని వందే మాతరం ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. దీనికి రావాల్సిందని వడ్డెరపు జయశ్రీకి ఆహ్వానం అందింది. మూడు రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో ఈమె పాల్గొంటుంది. ఈ విద్యార్థులను ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి సన్మానిస్తారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కారేపల్లి, జూన్ 9: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-04 విద్యాసంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం జరిగింది. తమ గురువులను విద్యార్థులు సన్మానించారు. రామయ్య, ఝాన్సీ, భారతి, ఝాన్సీ, బ్రహ్మారెడ్డి, విజయ్‌కుమార్, శ్రీలత, ఉమ, భీమవరపు శ్రీనివాసరావు, విజయ్‌కుమారి, పద్మావతి, వీరభద్రం, మురళి, ప్రసాద్, రాజు, నూర్జహాన్, సంపత్, సత్యం, స్వాతి, హేమ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం

1989-92 బ్యాచ్ విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 9 : నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1989-1992లో డిగ్రీ బీఏ, ఈపీపీ, హెచ్ఈపీ కోర్సులు చదివిన విద్యార్థులు ఖమ్మంలోని డీఆర్‌పీసీ భవనంలో ఆటపాటలతో సంబురంగా గడిపారు. హైదరాబాద్, బెంగుళూరు, ముంబాయి ప్రదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు అందరూ కలిసి నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఎస్.వెంకన్న, బల్లేపల్లి మోహన్, భద్రాద్రి జడ్పీ సీఈవో చంద్రశేఖర్, ఏసీపీ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 9 : నగరంలోని వాణి జూనియర్ కళాశాలలో 2004-05లో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నగరంలోని మినర్వా హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. తమ గురువులకు సన్మానం చేశారు.

లేబర్ కోడ్‌తో గుమస్తాలకు కష్టకాలం

మాట్లాడుతున్న మల్లూరు చంద్రశేఖర్

పెనుబల్లి, జూన్ 9: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌తో షాపు గుమస్తాలకు కష్టకాలం వచ్చిందని షాపు గుమస్తాల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని వీఎం.బంజరలోగల చలమాల సూర్యనారాయణ భవనంలో ఆదివారం గుమస్తాల సమావేశంలో మాట్లాడారు. లేబర్ కోడ్‌తో గుమస్తాలకు ఉపాధి భద్రత, ఇతరత్రా హక్కులు ఉండవని చెప్పారు. నాయకుడు చీపు మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు అనిల్, అనుదీప్

కూసుమంచి (నేలకొండపల్లి), జూన్ 9: నేలకొండపల్లిలోని సీపీఎం కార్యాలయం లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నూతక్కి గంగాధర్ సేవా కమిటీ నిర్వహించింది. ఆర్థోపెడిక్ డాక్టర్ మేదర మెట్ల అనిల్, డాక్టర్ కొల్లి అనుదీప్ తదితరులు వైద్య పరీక్షలు చేశారు. సేవా కమిటీ సభ్యులు కేవీ రాంరెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, యరదేశి నర్సింహారావు, బండారుపల్లి నాగేశ్వరరావు, బండి పుష్పలత, ఎస్‌కే తానీషా తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో..

ప్రైవేట్ కళాశాలల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 9: జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ఆ వివరాలను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు వెల్లడించాయి.

న్యూవిజన్ విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్

న్యూవిజన్ సత్తా..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా ఒపెన్ కేటగిరీలో ఖమ్మంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థులు కే.వర్షిత్ 644వ ర్యాంక్, మహశ్వి-760వ ర్యాంక్‌తో సత్తా చాటినట్లు చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. కేటగిరీ విభాగంలో ప్రభంజన్‌జాదవ్ 12వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. నితిష్‌కుమార్-79, మురళీ కృష్ణ-97, రిషిత్‌పవార్-102, శ్రీరామ్-210, భావన-294, జీతా హర్షిణి-297, లోకేష్-341, రేవంత్-382, దివ్యశ్రీ-386, పుష్పక్‌శివసాయి-429, నమిత-519 ర్యాంక్‌లు సాధించారు. ఐఐటీలో 44, ఎన్ఐటీలో 43, బిట్‌శాట్‌లో 20, ఎంబీబీఎస్‌లో 41 మంది విద్యార్థులు సీట్లు సాధించినటులు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తిక్, డైరెక్టర్ గోపీచంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

శ్రీచైతన్య ప్రతిభ

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య తెలిపారు. తమ విద్యార్థుల్లో డీ శైలజ-2వ ర్యాంక్, రాంచరణ్-31, వెంకటమణిరామ్-45, సందీప్-74, అభిలాష్-101, సాత్విక్-115, శివసాయి-119, సాయిదినేష్‌రెడ్డి-138, రాంచరణ్ తేజ-167, శ్రీనివాస్-179, సిద్దు-241, తుషార్-249, రాఘవ-267, సంజయ్-310, శ్రీసాత్విక్-320, సునీల్‌కుమార్-366, అనీల్-409వ ర్యాంక్‌లు సాధించినట్లు వివరించారు. మారుతున్న పరీక్షా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే తులనాత్మక విద్యాప్రణాళికతోపాటు రాష్ట్రంలోని బెస్ట్ లెక్చరర్లతో విద్యాబోధనను అందించడం వల్ల అత్యుత్తమ ర్యాంకులు సాధించామని వివరించారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాధుర్, డీన్ వర్మ, ఏజీఎంలు బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

హార్వెస్ట్ అద్భుతం..

హార్వెస్ట్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఖమ్మంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ తెలిపారు. ఆలిండియా స్థాయిలో జశ్వంత్-94వ ర్యాంక్, గోపిచంద్-161, మనోహర్‌చౌహాన్-337, సంతోష్-433, తపస్వి-873, శరన్‌మేఘ-878, హైందవీరాథోడ్-888వ ర్యాంక్‌లతో రాణించినట్లు వివరించారు. ఫలితాల్లో విశేష ప్రతిభ కనబర్చిన హార్వెస్ట్ విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను, అధ్యాపకులను ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రెజొనెన్స్ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్

రెజొనెన్స్ అత్యుత్తమ ర్యాంక్‌లు..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఖమ్మంలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారని డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. దినేష్-288, జీవన్‌కుమార్-364, ప్రవీణ్-729, లోకేష్-942, కేశవకుమార్-1186వ ర్యాంక్‌లు సాధించినట్లు వివరించారు. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్, ఎంసెట్ వంటి అన్ని జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి అభినందించారు.

కృష్ణవేణి విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు

కృష్ణవేణి విజయఢంకా..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఖమ్మంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారని విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. నితిన్-714, సాయికిరణ్-885, రోహిత్‌కుమార్-961, చరణ్-1029, మోహిత్‌నాయక్-1279, అఖిల్-1338, ప్రియదర్శిని-2574, కార్తీక్-2630, ఆనంద్‌కుమార్-2782వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, ఇన్‌చార్జి వంశీకృష్ణ, ఏవో నిరంజన్‌కుమార్ తదితరులు అభినందించారు.

11న లాటరీ ద్వారా 1, 5 తరగతుల ఎంపిక

ఖమ్మం, జూన్ 9 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ద్వారా నిర్వహించే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకానికి సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికి 1వ తరగతి నాన్ రెసిడెన్సియల్, 5వ తరగతి రెసిడెన్సియల్‌లో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక ఈ నెల 11వ తేదీన స్థానిక డీపీఆర్‌సీ సమావేశ మందిరం(నూతన మున్సిపాలిటీ కార్యాలయం వెనుక)లో జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఉపసంచాలకులు కె.సత్యనారాయణ తెలిపారు. 1వ తరగతి విద్యార్థుల ఎంపిక ఉదయం 11గంటలకు, 5వ తరగతి విద్యార్థుల ఎంపిక మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు 25మంది ఎంపిక

ఖమ్మం, జూన్ 9 : ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్లో ఈ నెల రెండో తారీఖున జరిగిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మహిళా, పురుషుల పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 25మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మనోజ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పురుషుల విభాగంలో 59 కిలోల పవర్‌లిఫ్టింగ్‌లో జి.సతీష్(క్లాసిక్ జిమ్), 66కిలోల విభాగంలో బి.సాయికిరణ్(క్లాసిక్ జిమ్), 74 కిలోల విభాగంలో కే.గోపీచంద్(క్లాసిక్ జిమ్), 83 కిలోల విభాగంలో ఎం.పవన్(క్లాసిక్ జిమ్), జయ ప్రదీప్(ఖమ్మం), 93 కిలోల విభాగంలో వై.స్వర్ణకుమార్, పి సిద్ధార్థ(క్లాసిక్ జిమ్), 105 కిలోల విభాగంలో బి.సిరాజ్(క్లాసిక్ జిమ్), 120 కిలోల విభాగంలో బి.కార్తీక్, బి.ప్రమోద్ (క్లాసిక్ జిమ్), 120 కిలోల విభాగంలో సీహెచ్ రేవంత్(క్లాసిక్ జిమ్), మహిళా విభాగంలో 47 కిలోల కే.నేహా(క్లాసిక్ జిమ్), 52 కిలోల విభాగంలో ఎండీ రెహమతున్నీసా బేగం(క్లాసిక్ జిమ్), 57 కిలోల విభాగంలో వి.దివ్య(క్లాసిక్ జిమ్), 63 కిలోల విభాగంలో స్రవంతి(స్టే ఫిట్ జిమ్) కే. షైనీ, సమిత(క్లాసిక్ జిమ్), 69 కిలోల విభాగంలో సీహెచ్ నగీన(క్లాసిక్ జిమ్) శరీర ఆయేషా(నరేన్ జిమ్), 72 కిలోల విభాగంలో ఏ.శాలిని, బి.యమునా (క్లాసిక్ జిమ్), 24 కిలోల విభాగంలో వీ. కీర్తన, టి .నిషా(క్లాసిక్ జిమ్), 84 ప్లస్ విభాగంలో ఈ.రోజా(క్లాసిక్ జిమ్) అర్హత పొందారు. వీరు జూలై 6, 7 తేదీల్లో ఖమ్మంలో జరుగనున్న సీనియర్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు సపోర్ట్ చేసిన క్లాసిక్ జిమ్ ప్రొప్రయిటర్ సీహెచ్ నగీన దరి, వ్యాపారవేత్త రాపర్తి రాజా, ఖమ్మం జిల్లా ప్రెసిడెంట్ గౌస్ పాషా రాష్ట్రస్థాయికి ఎంపికైన లిఫ్టర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్‌లో సర్వజ్ఞ విద్యార్థి ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్స్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 9 : నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థి చార్విక్ టేబుల్‌టెన్నిస్ అండర్-14 పోటీల్లో జిల్లాస్థాయి ప్రథమ బహుమతిని సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్ తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న చార్విక్ తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్పోర్ట్స్ జోన్ ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకొని జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని డైరెక్టర్ కొలిపార నీలిమ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖేలో ఇండియా ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఉషు పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మం సిటీ, జూన్ 9 : సౌత్‌జోన్ ఉమెన్స్ ఖేలో ఇండియా ఉషు లీగ్ పోటీలు ఈ నెల 13వ తేదీన కర్నాటకలోని బాగల్‌కోట్ బీవీవీ సంఘం క్యాంపస్‌లో జరుగనున్నాయి. వాటి కి రాష్ట్ర స్థాయి జట్టులో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం ఉషు క్రీడాకారిణులు టీ సాయి భవ్యశ్రీ(27 కిలోల విభాగం) సాన్-ద బాక్సింగ్, పీ పవిత్రాచారి (నాన్- దావో ఈవెంట్ విభాగం) ఎంపికయ్యారు. వారిని జిల్లా యువజన క్రీడల అధికారి టీ సునీల్‌రెడ్డి, కోచ్ పరిపూర్ణాచారి ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రాచీన కళలకు ఎప్పటికీ ఆదరణ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జూన్ 9 : ప్రాచీన కళలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నటరాజ నృత్య కళానికేతన్ 48వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో తమ నృత్య ప్రదర్శనలు చేసిన సందర్భంగా పలువురు చిన్నారులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. ఈ సందర్భంగా వారిని మంత్రి పొంగులేటి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో కూడా ప్రాచీన కళలకు ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇతర దేశాల్లోనే కాకుండా భారతదేశంలో కూడా కూచిపూడి, భరతనాట్యం, కథక్ తదితర కళలలో మంచి ప్రాచుర్యం పొంది జాతీయ, అంతర్ జాతీయ, రాష్ట్రస్థాయిలో కూడా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. నటరాజ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు, మాస్టర్ ఎస్.మాధవరావు 48 సంవత్సరాలుగా వేలాది మంది పిల్లలకు శిక్షణ ఇవ్వడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో నటరాజ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు ఎస్ మాధవరావు, సీనియర్ జర్నలిస్టు మాధవరావు యెగినాటి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అభినందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

మాట్లాడుతున్న మొండితోక జయాకర్

మధిర, జూన్ 9: మధిర మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను బీఆర్ఎస్ నాయకుడు మొండితోక జయాకర్ కోరారు. మధిర మున్సిపాలిటీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ఆదివారం డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని పార్టీల నాయకుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. మొండితోక జయాకర్ మాట్లాడుతూ.. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, అధికారులు కూడా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారని చెప్పారు. నిధులను పెంచాలని కోరారు. ఆయా పార్టీల నాయకులు వాసిరెడ్డి రామనాథం, బెజవాడ రవిబాబు, కట్టా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ పరీక్ష

మాట్లాడుతున్న రమేశ్‌కుమార్ మక్కడ్

కొత్తగూడెం టౌన్, జూన్ 9 : దేశంలోని న్యాయ వ్యవస్థ మరింత ఉన్నతంగా ఎదగడం కోసం ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) కృషి చేస్తున్నదని జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ మక్కడ్ అన్నారు. ఈ నెల 23వ తేదీన తెలంగాణ హైకోర్టు తలపెట్టిన జూనియర్ సివిల్ జడ్జి నియామకాల కోసం నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించడం కోసం కొత్తగూడెం బార్ అసోసియేషన్ హాల్‌లో ఐలూ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మక్కడ్, కిలారు పురుషోత్తంరావు మాట్లాడుతూ మంచి నాణ్యమైన న్యాయమూర్తులు సమాజానికి చాలా అవసరమన్నారు. న్యాయవాదులకు ప్రతి నెలా వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర బాధ్యులు కిషన్‌రావు మాట్లాడతూ ఐలూ కార్యక్రమాల్లో న్యాయవాదులందరూ పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోడల్ టెస్టులో కొత్తగూడెంలో ప్రథమస్థానంలో నిలిచిన కాటూరి బిందును వక్తలు అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ క్రీడా సాంస్కృతిక కార్యదర్శి దూదిపాల రవికుమార్, మహిళా ప్రతినిధి నల్లమల ప్రతిభ, ఐలూ బాధ్యులు పుల్లయ్య, తెల్లబోయిన రమేశ్, పసుపులేటి శ్రీనివాస్, బార్ మాజీ అధ్యక్షుడు రాంప్రసాద్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

చింతకాని, జూన్ 9: మండలంలో రాఘవాపురం గ్రామంలో దొబ్బల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు చింతనిప్పు ప్రవీణ్, దొబ్బల దినేష్ తదితరులు కలిసి రూ.2.5 లక్షల విలువైన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించి, పంచాయతీకి అందించారు. వారిని గ్రామ పెద్దలు సత్కరించారు.

మంత్రి పొంగులేటి పరామర్శ

పద్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి పొంగులేటి, నాయకులు

కూసుమంచి, జూన్ 9: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రామసహాయం వెంకటరెడ్డి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. వెంకటరెడ్డి తల్లి పద్మమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రామసహాయం నరేశ్ రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, జూకూరి గోపాల్‌రావు, సుధాకర్ రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గాయాలతో స్పృహ కోల్పోయిన మహిళలు

బోనకల్లు, జూన్ 9: కారు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని సీతానాగారం గ్రామంలో ఆదివారం ఇది జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన కంద్రాతి శశికుమార్‌కు వివాహ సంబంధం కుదిరింది. కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిశ్చయ తాంబూలం వేడుకకు తన బంధువులైన ఇద్దరు మహిళలతో కలిసి కారులో బయల్దేరాడు. వైరా-బోనకల్లు ప్రధాన మార్గంలోగల సీతానాగరం సమీపంలోకి రాగానే, ద్విచక్ర వాహనం మీద నుంచి ఓ వ్యక్తి (వైరా మండలం వల్లాపురం గ్రామస్తుడు వీరయ్య) కిందపడిపోయాడు. అతడిని తప్పింపే ప్రయత్నంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. అందులో ఉన్న శివకుమార్‌కు, ఇద్దరు మహిళలకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆ ఇద్దరు మహిళలు స్పృహ కోల్పోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది వెంటనే వచ్చి, ఆ క్షతగాత్రులను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. బోనకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

చింతకాని, జూన్ 9: ఆటో బోల్తాపడిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మండలంలోని లచ్చగూడెం గ్రామ సమీపంలోని గోదాము వద్దనున్న మూలమలుపు వద్ద ఆదివారం ఇది జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... చింతకాని గ్రామస్తుడు ఆటో డ్రైవర్ పుట్టబంతి వెంకటనారాయణ ఆటోలో మొగిలి లక్ష్మి ఆదివారం మధ్యాహ్నం చింతకాని నుంచి ఖమ్మం బయల్దేరింది. లచ్చగూడెం గ్రామం దాటగానే మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. మొగిలి లక్ష్మి(45) అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ వెంకటనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద స్థలాన్ని ఎస్సై షేక్ నాగుల్‌మీరా పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి

వైరా రూరల్, జూన్ 9: మండలంలోని లింగన్నపాలెం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు తోటకూరి సత్యనారాయణ(100) మృతిచెందారు. మృతదేహాన్ని పార్టీ నాయకులు భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రామోజీరావుకు నివాళి

వైరా టౌన్, జూన్ 9: రామోజీరావు మృతికి వైరా కమ్మ జన సేవాసమితి, టీడీపీ నాయకులు ఆదివారం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతనిప్పు వెంకటేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, సూర్యదేవర శ్రీధర్, శ్రీరామనేని విజయభాస్కర్, కర్నాటి హనుమంతరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మన్నేపల్లి ప్రదీప్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

భద్రాచలం, జూన్ 9: శ్రీరామాయణ పారాయణ సేవా సమితి, శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో 31వ నెల వితరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులను స్థానిక సత్యసాయి సేవా సమితి భవనంలో పంపిణీ చేశారు.